నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శనివారం 3 మే 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY


# ఇంకెన్నాళ్లు తిప్పలు పెడ్తరు?

- అన్నదాతల ఆగ్రహం
- రాయిచూర్ హైవేపై బైఠాయింపు
- రైస్‌మిల్లర్లు ధాన్యం దించడం లేదని ఆందోళన



గుడెబల్లూర్ వద్ద జాతీయ రహదారిపై ధాన్యం ట్రాక్టర్లు అడ్డుపెట్టి నిరసన తెలుపుతున్న రైతులు

మాగనూరు/కృష్ణ, మే 2 : పంట సాగు మొదలుకొని అమ్ముకునే వరకు కాంగ్రెస్ సర్కారులో అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మిల్లుల వద్ద వారాలు గడిచినా ధాన్యం దింపుకోకపోవడంతో విసుగుచెందిన రైతులు శుక్రవారం గుడెబల్లూరు సమీపంలో జాతీయ రహదారిపై ట్రాక్టర్లను అడ్డంగా పెట్టి వందల మంది గంటపాటు నిరసన తెలిపారు. ధాన్యం తీసుకొచ్చి వారాలు గడిచినా దింపుకునే నాథుడు లేడని, 15మంది కూలీలను పెడితే వేల బస్తాలు ఎప్పుడు దింపుకొంటారని ప్రశ్నించారు. దీనికితోడు మూడు కిలోల తరుగు తీస్తున్నారని ఆరోపించారు. కోస్గి, కొడంగల్ నుంచి వచ్చిన లారీలను ముందుగా దింపుకొని చిన్న, సన్నకారు రైతులను రోజుల తరబడి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాగా, కొంతమంది బస్సు యజమానులు రాస్తారోకో నుంచి వెళ్లాలని ప్రయత్నం చేయగా, రైతులు అడ్డుకొని ముండ్ల కంప, రాళ్లు తెచ్చి రోడ్డుకు అడ్డంగా పెట్టి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న తాసీల్దార్ వెంకటేశ్, ఎస్సై నవీద్, పీఏసీసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా వినకపోవడంతో వారాజన్య రైస్‌మిల్ యజమానితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైస్‌మిల్లులో ధాన్యం దింపుకోవడానికి స్థలం లేదని, సమాధానమిచ్చారు. దీంతో కృష్ణా, ఇందుపూరు శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన వసుధ రైస్‌మిల్లు యజమానితో మాట్లాడి ధాన్యం దింపుకొనేలా చర్యలు చేపట్టారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.



ఆందోళనకు దిగిన రైతులను సముదాయిస్తున్న తాసీల్దార్, ఎస్సైలు



హన్వాడలో ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# ధాన్యం వెంటనే కొనాలి

- వర్షాలకు తడుస్తుండడంతో రైతులకు తీరని నష్టం
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.. గన్నీ బ్యాగులు ఇవ్వడం మరిచారు
- రైతులను నిండా ముంచుతున్న కాంగ్రెస్
- పాలమూరు ప్రాజెక్టు పనులు చేపట్టాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, మే 2 : సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలతో రైతులు నిండా మునిగారని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హన్వాడ మండల కేంద్రంలోని రైతు సేవాసహకార సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలును వేగవంతం చేస్తే రైతులు నష్టపోయేవారు కాదన్నారు. సర్కారు నిర్లక్ష్యం కారణంగా కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, కొనుగోలు చేసి లారీలకు ఎత్తని ధాన్యం సైతం తడిసి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులపై కాంగ్రెస్ సర్కారు కక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నదని, రైతులను గోసపెడితే అడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. గన్నీ బ్యాగులు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో సర్కారు ఉండడం సిగ్గుచేటని, రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తుంటే కళ్లకు కనబడడం లేదా అంటూ మండిపడ్డారు. బోనస్ ఇస్తామని బోగస్ చేశారని ఆరోపించారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40వేలు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేదంటే వారిపక్షాన ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ హయాంలో పాలమూరు ప్రాజెక్టు పనులు 90శాతం పూర్తి చేశామని, మిగిలిన 10శాతం పూర్తి చేసేందుకు కాంగ్రెస్ సర్కారు ముందుకు రాకపోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ సర్కారు కాల్వలకు టెండర్లు పిలిస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా గన్నీబ్యాగులిచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటయ్య, నాయకులు నరేందర్, లక్ష్మయ్య, శ్రీనివాసులు, అనంతరెడ్డి, మాధవులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పడిగాపులు



కోస్గి మండలం కడంపల్లి శివారులోని రైస్‌మిల్లు వద్ద ధాన్యం ట్రాక్టర్లు

- వడ్లు విక్రయించేందుకు తప్పని నిరీక్షణ
- రైస్‌మిల్లులను ఆశ్రయిస్తున్న కర్షకులు
- కొనుగోలు కేంద్రాలకు ఆదరణ కరువు
- సీఎం ఇలాకాలో తప్పని ఇక్కట్లు

కోస్గి, మే 2 : మొన్నటి వరకు కరెంట్ సమస్యలు.. యాసంగిలో సాగైన పంటలను ఎలా కాపాడుకోవాలో అని రైతులు ఆందోళన చెందారు. ఇప్పుడేమో కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు ఇక్కట్లు పడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. స్వయంగా సీఎం రేవంత్ ఇలాకా.. కొడంగల్‌లో పరిస్థితి ఇలా తయారైంది. నారాయణపేట జిల్లాలోని కోస్గి మండలం కడంపల్లి, నాచారం గ్రామ శివారుల్లోని రైస్‌మిల్లుల వద్ద రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. వరి కోతలు పూర్తవగా.. చేసేది లేక ధాన్యం విక్రయించేందుకు మిల్లులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ఆదరణ అంతంతే ఉండడం.. అవి కూడా సరైన సమయంలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు ఉపయోగకరంగా లేవు. దీనికి తోడు అడుగడుగునా అధికారులు అడ్డంకులు సృష్టిస్తుండడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నారని.. కాంగ్రెస్ వచ్చాక మా కష్టాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు చేయడంలో మిల్లుల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కర్షకులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రోజుల తరబడి వాహనాలు అక్కడే ఉంటుండడంతో ట్రాక్టర్లకు వెయిటింగ్ చార్జీల మోత మోగుతున్నదని వాపోతున్నారు.

# ప్రాగటూర్‌లో భారీ అగ్నిప్రమాదం

- 18 గడ్డివాములు దగ్ధం
- రూ.27.82 లక్షల ఆస్తినష్టం

అలంపూర్ చౌరస్తా, మే 2 : ఉండవెల్లి మండలం ప్రాగటూరులో 18 గడ్డివాములు అంటుకొని రూ.27లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించింది. గ్రామస్తులు, బాధితుల కథనం ప్రకారం.. ప్రాగటూర్‌కు చెందిన 12 మంది రైతులు గ్రామంలోని కల్లాల్లో పక్కపక్కనే పశువుల మేత కోసం 18గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి ఓ మహిళ ఇంట్లో నుంచి బహిర్భూమికి వెళ్లగా, గడ్డివాముల వద్ద మంటలు కనిపించాయి. దీంతో మహిళ గట్టిగా కేకలు పెట్టగా చుట్టుపక్కల వారు ఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. వారు వచ్చి మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. అప్పటికే గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. 18 గడ్డివాములు, పైపులు, ఎద్దుల బండ్లు, వ్యవసాయ పనిముట్లు, ఎద్దులు ఉండే గుడిసెలు ఇలా రైతులకు సంబంధించిన పరికరాలు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న తాసీల్దార్ ప్రభాకర్ రెవెన్యూ సిబ్బందితో కలిసి శుక్రవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాదాపు రూ.27,82,200ల ఆస్తినష్టం వాటిల్లిందని అంచనా వేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే గుర్తుతెలియని దుండగులు గడ్డివాములకు నిప్పుపెట్టారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# లారీని ఢీకొట్టిన వోల్వో బస్సు



లారీని ఢీ కొట్టడంతో దెబ్బతిన్న బస్సు ముందు భాగం

మక్తల్, మే 2 : లారీని వోల్వో బస్సు ఢీకొట్టిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. మక్తల్ నల్లజానమ్మ ఆలయ సమీపంలో జాతీయ రహదారిపై లారీని నిలిపి ఉంచారు. కర్ణాటక నుంచి హైదరాబాద్ వెళ్తున్న వోల్వో బస్సు నిలిపి ఉన్న లారీని శుక్రవారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతినగా, తృటిలో 35 మంది ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. బస్సుడ్రైవర్‌తో పాటు సహాయకుడికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని స్థానికులు రాయిచూర్‌లోని దవాఖానకు తరలించారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.



దంతనూరులో బిల్లు రాక బేస్‌మెంట్ వరకు నిలిచిన ఇంటి నిర్మాణం

# ఇరకాటంలో.. ఇందిరమ్మ ఇండ్లు

- పొంతనలేని ప్రొసీడింగులు
- మోడల్ ఇండ్లకు మోక్షం కరువు
- నత్తనడకన సాగుతున్న సర్వే
- ఎమ్మెల్యేల లిస్టులతో అధికారుల కుస్తీ
- నిర్మాణానికి ముందుకు రాని లబ్ధిదారులు

| మండలం | ప్రత్యేకంగా గుర్తించిన జీపీ | ప్రొసీడింగ్ ఇచ్చిన ఇండ్ల సంఖ్య |
|---|---|---|
| కొత్తకోట | రామంతాపూర్ | 70 |
| మదనాపురం | దంతనూరు | 60 |
| చిన్నంబాయి | చిన్నంబాయి | 01 |
| పాన్‌గల్ | మాధవరావుపల్లి | 57 |
| వీపనగండ్ల | సంపత్‌రావుపల్లి | 75 |
| అమరచింత | చింతరెడ్డిపల్లి | 26 |
| ఆత్మకూరు | దేవరపల్లి | 82 |
| ఖిల్లఘణపురం | సల్కలాపూర్ | 100 |
| గోపాల్‌పేట | చెన్నూరు | 151 |
| పెబ్బేరు | ఈర్లదిన్నె | 82 |
| పెద్దమందడి | మంగంపల్లి | 49 |
| రేవల్లి | తల్పునూరు | 116 |
| శ్రీరంగాపురం | నాగసానిపల్లి | 152 |
| వనపర్తి | అప్పాయిపల్లి | 113 |
| ఏదుల | చీర్కపల్లి | 73 |
| జిల్లా మొత్తం | | 1,207 |

వనపర్తి, మే 2 (నమస్తే తెలంగాణ) : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వనపర్తి జిల్లాలోని 15మండలాల వారీగా ఒక్కో గ్రామాన్ని ప్రత్యేకంగా ఎంచుకొని అప్పట్లోనే ప్రొసీడింగ్‌లు ఇచ్చారు. జనవరి 26వ తేదీన ఇండ్ల పథకంతోపాటు మరికొన్ని పథకాలను కూడా ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించింది. ఒక నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేస్తామని, ఇందుకు ఎమ్మెల్యేనే ఫైనల్ అథారిటీగా ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 1,127 మందికి ఎంపిక చేసిన 15 గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల ప్రొసీడింగ్స్‌ను ఇచ్చారు.

**ముగ్గుపోసింది 415 ఇండ్లకే..**

జిల్లాలో ఎంపిక చేసిన 15 గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం అనుకున్న స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఇక ప్రత్యేక గ్రామాల్లోనే ఇలా ఉంటే, ఇక త్వరలోనే అన్ని గ్రామాల్లోనూ అలజడి మొదలుకాబోతున్నది. ఇప్పటి వరకు 1,127 ఇండ్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వగా, 415 ఇండ్లకు మాత్రమే 15 గ్రామాల్లో పునాదులు తవ్వడం కోసం ముగ్గు పోశారు. వీటిలో కేవలం 110 మంది మాత్రమే పునాదుల వరకు నిర్మాణాలు చేసుకున్నారు. మిగితా లబ్ధిదారులంతా వెనకా, ముందు అవుతున్నారు. మండల పరిషత్ అధికారులు ఎన్ని దఫాలు చెప్పినా నిర్మాణాలను చేపట్టడం లేదు. ఇదిలా ఉంటే, బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మాణం చేసుకున్న వారిలో కేవలం 45మందికి మాత్రమే రూ.లక్ష బిల్ ఇచ్చినట్లుగా అధికారులు చెబుతున్నారు. ఇంకా మిగిలిన లబ్ధిదారులు నెల రోజుల నుంచి ఆశతో ఎదురు చూస్తున్నారు. ఒక ఇంటికి రూ.5లక్షలు ఇస్తామని ప్రభుత్వం చెప్పగా, మూడు విడుతలుగా బిల్లులు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం చెప్పిన కొలతల ప్రకారం ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులు గ్రామాల్లో సుముఖంగా కనిపించడం లేదు.

**మోడల్ ఇండ్లకే మోక్షం లేదు..**

జిల్లాలోని 15 మండల కేంద్రాల్లో మోడల్ హౌజ్ నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం తలచింది. ముందుగా వీటి నిర్మాణం చేయించి ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులకు మోడల్‌గా ఈ ఇండ్లను చూపించాలని నిర్ణయించారు. ఇలా మొదలెట్టిన మోడల్ నిర్మాణాలు కూడా నత్తనడకన సాగుతుండటం విమర్షలకు దారితీస్తున్నది. ఒక్క జిల్లా కేంద్రం మినహా ఇతర ప్రాంతాల్లో కొలిక్కి రావడం లేదు. గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల, అమరచింత మండలాల్లో మోడల్ ఇండ్ల పనులే ప్రారంభించలేదు.

**సాగుతున్న సర్వే..**

ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తున్నది. ఇందుకు ఎమ్మెల్యేలనే సుప్రీమ్‌గా నిర్ణయిస్తూ ఫైనల్ చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యేలు కూడా అన్ని గ్రామాలకు సంబంధించిన లిస్టులను కలెక్టర్లకు అందజేశారు. అయితే, ఈ లిస్టులకు సంబంధించి ప్రత్యేక అధికారులతో సర్వే చేస్తున్నారు. ఏప్రిల్ 30న ఫైనల్ లిస్టును ప్రకటించాల్సి ఉన్నా సర్వే పూర్తి కాలేదు. ప్రస్తుతమున్న నిబంధనలు ఆటంకాలు కలిగిస్తున్నాయని ఇందిరమ్మ కమిటీల బాధ్యులు తలలు పట్టుకుంటున్నారు. మరి కొన్ని చోట్ల సభ్యులు తమ పేర్లను లిస్టులో ఉంచాలన్న తగవులు కూడా ఉన్నాయి.

అధికారులు సర్వే చేసి తొలగించినా సరే.. లిస్టులో పేర్లు ఉండాలని మరికొన్ని చోట్ల కమిటీ సభ్యులు పట్టుబడుతుండటం ఆలస్యానికి కారణమవుతున్నట్లు తెలుస్తున్నది. వీపనగండ్ల మండలంలోని తూంకుంట, సంగినేనిపల్లి, కల్వరాల గ్రామాల్లో ఇప్పటి వరకు సర్వేలో అడుగులు పడలేదంటే జిల్లాలో సర్వే ఎలా కొనసాగుతుందో అర్థమవుతున్నది.

**వేగం పెంచుతాం..**



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచుతాం. ఉగాది తర్వాత పనులు చేయాలన్న లక్ష్యంతో చాలా మంది ఆలస్యం చేశారు. కొన్ని చోట్ల ముందుకు రావడం లేదు. కొన్ని ప్రొసీడింగ్‌లు క్యాన్సిల్ అయ్యాయి. ప్రభుత్వ సూచనల మేరకు నిర్మాణం చేసుకోవాలి. మూడు విడుతల్లో బిల్లులు అందజేస్తాం. 17–22 ఫీట్ల సైజులో నిర్మాణం జరగాలి. ప్రత్యేక గ్రామాల నిర్మాణాలను త్వరితగతిన చేపడుతాం. పూర్తి చేసుకున్న వారికి బిల్లులు చెల్లిస్తాం. – జీ పర్వతాలు, ప్రాజెక్టు డైరెక్టర్, హౌసింగ్, వనపర్తి జిల్లా

# ఇండ్లు మాకొద్దు

- నిధులు లేవని సర్కారే చెబుతున్నది
- పనులు ప్రారంభించాక డబ్బులు లేవంటే మిగిలేది అప్పులే
- 69 మంది లబ్ధిదారుల నిరాకరణ

మానవపాడు, మే 2 : ఇందిరమ్మ ఇళ్లు మాకొద్దు సారూ అంటూ 69మంది లబ్ధిదారులు ఎంపీడీవోకు వినతిపత్రాలు అందించిన ఘటన మండలంలోని చంద్రశేఖర్‌నగర్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వం నిధులు లేవని అన్నింట్లోనూ కోతలు విధిస్తున్నదని, నిర్మాణాలు చేపట్టాక బిల్లులు రాకపోతే మేం అప్పుల పాలవుతామని గృహనిర్మాణాలకు నిరాకరణ చెప్పారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన చంద్రశేఖర్‌నగర్‌లో లబ్ధిదారులు గృహనిర్మాణానికి ఆసక్తి చూపకపోవడం గమనార్హం. చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్, చంద్రశేఖర్‌నగర్ క్యాంప్‌నకు 114ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు వస్తాయని అధికారులు చెప్పగా, ప్రస్తుతం అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాక, డబ్బులు ఇవ్వకపోతే మా పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆరు గురివి డబుల్ దరఖాస్తులు రావడంతో వాటిని తిరస్కరించారు. గృహనిర్మాణం చేసుకోవాలని 36 మంది స్థలాలకు మార్కింగ్ ఇవ్వగా, అందులో 9 మంది మాత్రమే నిర్మాణాలు ప్రారంభించారు.



చంద్రశేఖర్‌నగర్ గ్రామంలో బేస్‌మెంట్ వరకు పూర్తయిన ఇల్లు

69మంది లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం చేపట్టలేమని తేల్చిచెప్పారు. కాగా, 9 ఇండ్లకు బేస్మెంట్ పూర్తి చేసుకోగా, ముగ్గురికి రూ.లక్ష చొప్పున బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసినట్లు ఎంపీడీవో తెలిపారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే బిల్లులు జమచేస్తామన్నారు.

# గాలివాన బీభత్సం

- కల్లాల్లో తడిసిన ధాన్యం
- దొడ్డిపల్లిలో తెగిన హైటెన్షన్ వైర్లు
- కాలిపోయిన మోటర్లు, స్టార్టర్లు
- పాలమూరు, బాల్‌నగర్‌లో వడగండ్ల వర్షం



బాదేపల్లి మార్కెట్‌లో తడిసిన ధాన్యం బస్తాలు (ఇన్‌సెట్లో) భూత్పూర్‌లో కొట్టుకు పోతున్న ధాన్యం

జడ్చర్ల/భూత్పూర్/బాలానగర్/నవాబ్‌పేట, మే 2 : ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం కురిసిన అకాలవర్షాలతో అపారనష్టం వాటిల్లింది. జడ్చర్లలోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబెట్టిన, తూకాలు చేసిన ధాన్యం, మొక్కజొన్న బస్తాలు తడిసిపోయాయి. పత్తి మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. పాలమూరు. బాలానగర్, గంగాపూర్, కోడ్గల్ తదితర గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది. భూత్పూర్ మండలంలో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పూర్తిగా తడిసిపోయాయి. పంటకోసం 20రోజులైనా కొనుగోలు చేయకపోవడంతో తడిసిన ధాన్యంతో నిండా మునిగామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలానగర్ మండలంలో గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వాన రైతులకు కడగండ్లు మిగిల్చింది. మండలంలోని గౌతాపూర్, వనంవానిగూడ, బోడజానంపేట, హేమాజిపూర్, అప్పాజిపల్లి తదితర గ్రామాల్లో చేతికొచ్చిన 300ఎకరాల్లో వరి పంటలు నాశనమయ్యాయి. గౌతాపూర్‌కు చెందిన కళ్లెం శ్రీను కౌలుకు ఐదెకరాలు తీసుకొని సాగుచేయగా, మొత్తం ధాన్యం రాలిపోయింది. బాలానగర్, కేతిరెడ్డిపల్లి, గౌతాపూర్ గ్రామాల పరిధిలో మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. గౌతాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 80శాతానికి పైగా వరిపంటలు పాడైపోయాయని, ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.50వేల చొప్పున పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నవాబ్‌పేట మండలం దొడ్డిపల్లిలో గురువారం అర్ధరాత్రి హైటెన్షన్ నెలకొన్నది. గాలివాన బీభత్సానికి ఒక్కసారిగా హైటెన్షన్ వైర్లు తెగి విద్యుత్ వైర్లపై పడటంతో కాలిపోయి మంటలు చెలరేగాయి. దీంతో మోటర్లు, స్టాటర్లు కాలిపోయి మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పునరుద్ధరణ పనులను చేపట్టారు. త్వరలోనే పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా ప్రారంభిస్తామని ట్రాన్స్‌కో ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు.



వడగండ్ల ధాటికి రాలిపోయిన మామిడి కాయలు